ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.27.08.2025 సమయం.18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల భారీ వర్షాలు కురుస్తుండడంతో వాగులు,వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. వివిధ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.
2. అల్పపీడన ప్రభావంతో మరో రెండు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.
3. రాష్ట్రవ్యాప్తంగా ఈ రోజు గణపతి నవరాత్రులు ప్రారంభమయ్యాయి. ఖైరతాబాద్ భారీ వినాయకుని విగ్రహం వద్ద గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తొలి పూజ చేశారు.
4. రాష్ట్ర శాసన సభ వర్షాకాల సమావేశాలు ఈ నెల 30న ప్రారంభమవుతాయి.

-----------------------------

**వర్షాలు – లీడ్**

రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల వల్ల వాగులు,వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగింది. జలాశయాల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో అదే స్థాయిలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుల పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నందున ఆయా జిల్లాల యంత్రాంగాన్ని ప్రభుత్వం అప్రమత్తం చేసింది.

డెస్క్

----------------------------

**సీఎం – వర్షాలు**

రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. పాత భవనాలల్లో ఉన్నవారిని ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. హైడ్రా, జీహెచ్ఎంసీ, ఎన్డీఆర్ఎఫ్, అగ్నిమాపక దళం, పోలీస్ సిబ్బంది పరస్పర సమన్వయంతో సహాయ చర్యలు చేపట్టాలని చెప్పారు. వాగులు, కాలువలు పొంగి పొర్లుతుండడంతో కాజ్ వేలు కల్వర్టులపై నుంచి నీరు ప్రవహించే ప్రాంతాల్లో రాకపోకలను నిషేధించాలన్నారు. చెరువులు, కుంటలకు గండ్లు పడే అవకాశం ఉన్నందున నీటి పారుదల శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అంటు వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు పారిశుద్ధ కార్యక్రమాలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. వినాయక మండపాల వద్ద విద్యుత్ స్తంబాలు, ట్రాన్స్ ఫార్మర్లతో ముప్పు వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఇలా ఉండగా, వర్షాలు ఎక్కువగా కురుస్తున్న కామారెడ్డి, మెదక్ జిల్లాలలో  ఎలాంటి పరిస్థితిసైనా ఎదుర్కొనేందుకు సిద్దంగా ఉండాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అవసరమైన చోట ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాల సహాయం తీసుకోవాలన్నారు.

**MSL/DESK**

------------------------------------

**Add వర్షాలు:**

రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో సహాయ, పునరావాస కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు పోలీస్ కమిషనర్లతో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి. రామకృష్ణారావు హైదరాబాద్ నుంచి సమీక్షిస్తున్నారు. ఎలాంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం లేకుండా చర్యలు చేపట్టాలని మంత్రి ఈ సందర్భంగా ఆదేశించారు. విపత్తుల నిర్వహణ విభాగం స్పెషల్ సీ.ఎస్ అరవింద్ కుమార్ కూడా  హాజరయ్యారు. కాగా, భారీ వర్షాలు

కురుతున్న జిల్లాలకు ప్రత్యేకాధికారులుగా సీనియర్ IAS అధికారులను నియమించారు. మెదక్ జిల్లాకు ప్రత్యేకాధికారిగా జెన్కో ఎండీ హరీష్ ను ప్రభుత్వం నియమించింది.

**MSL**

---------------------------

**బండి సంజయ్ – కరీంనగర్**

కామారెడ్డి జిల్లాలోని పలు గ్రామాలు భారీ వర్షాలకు నీట మునిగాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాధితులను ఆదుకునేందుకు ఎన్డీఆర్ఎఫ్ అధికారులతో మాట్లాడినట్లు కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలియజేశారు. ఎన్డీఆర్ఎఫ్ జిల్లా కలెక్టర్ తో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యల్లో పాల్గొనాలని ఆదేశించారు.

**----- బైట్ బండి సంజయ్ ------**

**పీటీసీ – కరీంనగర్**

----------------------------

**వర్షాలు- రైల్వే**

భారీ వర్షాల కారణంగా, దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ లోని పలు సెక్షన్లలో వివిధ రైళ్ళను రద్దు చేసింది. కొన్నిటిని పాక్షికంగా రద్దు చేసింది. మరికొన్నింటిని దారి మళ్ళించింది. భిక్నూర్ - తల్మడ సెక్షన్, ఇంకా అకన్న పేట్ - మెదక్ సెక్షన్‌లలో ట్రాక్‌లపై నీరు పారుతుండడంతో రైళ్ళ రాకపోకలకు అంతరాయం కల్గిందని అధికారులు ప్రకటించారు. తిరుపతి - ఆదిలాబాద్ కృష్ణా ఎక్స్ ప్రెస్ ను వరంగల్, కాజీపేట్ మీదుగా మళ్లించినట్లు, హైదరాబాద్-జైపూర్ ఎక్స్ ప్రెస్ రైలును సికింద్రాబాద్ కాజీపేట్ మీదుగా నడుపుతున్నట్లు తెలియజేశారు.  కాగా రేపటి తిరుపతి-నిజామాబాద్ రాయలసీమ ఎక్స్ ప్రెస్ రద్దయింది. నాందేడ్ నుంచి విశాఖపట్నం వెళ్ళే ఎక్స్ ప్రెస్ రైలును చర్లపల్లి వద్ద నిలిపివేస్తారు.

**MSL**

---------------------------------

**వర్షం – కామారెడ్డి**

కామారెడ్డి జిల్లాలో అత్యంత భారీ వర్షపాతం నమోదైంది. రాజంపేట మండలంలోని ఆర్గొండలో ఈ ఉదయం నుంచి 41.8 సెంటి మీటర్లు, కామారెడ్డి లో 28 సెంటి మీటర్లు, భిక్కనూర్ లో 23.8 సెంటి మీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో అవసరమైతే తప్ప బయటికి రావద్దని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అవసరమైతే కలెక్టర్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ నెంబర్ 08468220069 ని సంప్రదించాలని కోరారు.

కాగా జిల్లాలో పలు గ్రామాలు భారీ వర్షాలకు జలమయం కావడంతో బాధితులను ఆదుకునేందుకు ఎన్డీఆర్ఎఫ్ సిద్దంగా ఉందని సహాయక చర్యలు చేపట్టాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ జిల్లా యంత్రాంగానికి సూచించారు.

కాగా మెదక్ జిల్లాలోకూడా అత్యంత భారీ వర్షాలు కురుస్తున్నాయి. సర్ధానా లో 26.1 సెంటి మీటర్ల వర్షపాతం నమోదైంది.

**పీటీసీ - కామారెడ్డి**

--------------------------

**వాతావరణం**

బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో మరో రెండు రోజుల పాటు రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియజేసింది. మెదక్, కామారెడ్డి జిల్లాలలో రేపు కూడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఉత్తర, తూర్పు, మధ్య తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

**డెస్క్**

--------------------

**వినాయక చవితి**

రాష్ట్రంలో వినాయక నవరాత్రులు ఈ రోజు ప్రారంభమయ్యాయి. గణేష్ చతుర్థిని భక్తులు ఈ రోజు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. హైదరాబాద్ ఖైరతాబాద్ లోని మహా గణేష్ విగ్రహానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తొలి పూజ చేశారు. 69 అడుగుల ఎత్తు, 28 అడుగుల వెడల్పుతో స్వామివారు శ్రీ విశ్వశాంతి మహా గణపతిగా దర్శనం ఇస్తున్నారు. విగ్రహానికి కుడి వైపున శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు, ఎడమ వైపున ఖైరతాబాద్ గ్రామదేవత గజ్జలమ్మ విగ్రహాలను నెలకొల్పారు. భారీ వర్షం కురుస్తున్నప్పటికి గణనాథుని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తుతున్నారు.

**డెస్క్**

-----------------------

**వినాయక చవితి – జిల్లాలు**

వినాయక చవితి సందర్బంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ప్రజలు మట్టి గణపతి విగ్రహాలనే పూజించాలని ఆయన సూచించారు.

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

-------------------------

**శాసనసభ సమావేశాలు**

రాష్ట్ర శాసన సభ వర్షాకాల సమావేశాలు ఈ నెల 30న ప్రారంభమవుతాయి. ఆ మేరకు శాసనసభ కార్యదర్శి వి.నరసింహాచార్యులు జారీ చేసిన నోటిఫికేషన్ ను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదించారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై జస్టిస్ పి.సి. ఘోష్ కమిషన్ నివే కను ప్రభుత్వం ఈ సమావేశాల్లో ప్రవేశపెడుతుంది. ఎజెండా ఇంకా ఖరారు కానప్పటికీ, ఎరువుల లభ్యత వంటి అనేక ప్రజా సమస్యలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. కాగా ముఖ్యమంత్ర రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ నెల 30వ తేదీన మంత్రివర్గ సమావేశం జరుగుతుంది.

**డెస్క్**

---------------------------

**ఒకరు గల్లంతు – రాజన్న సిరిసిల్ల జిల్లా**

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావు పేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు ఉప్పొంగడంతో ఐదుగురు పశువుల కాపరులు నీటిలో చిక్కుకున్నారు. వారిలో ఒకరు గల్లంతయ్యాడు. వారిని రక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితే తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని చిక్కుకున్న వారికి ఆహారం ఇతర సదుపాయలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అంతకుముందు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కు ఫోన్ చేసి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

------------------------

**వర్షాలు – ఆసిఫాబాద్**

ఆసిఫాబాద్ జిల్లాలో ఈ మద్యాహ్నం నుంచి భారీ వర్షం కురుస్తోంది. ఆసిఫాబాద్ – తిర్యాణి మార్గంలో బుగ్గగూడ వాగు పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. రెండు రోజుల పాటు వర్ష సూచన ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

**పీటీసీ – ఆసిఫాబాద్**

--------------------------------

**యాదాద్రి భువనగిరి**

యాదాద్రి భువనగిరి జిల్లాలో భారీ వర్షాలకు చెరువులు, వాగులు పొంగి ప్రవహిచడంతో భువనగిరి-చిట్యాల-నల్గొండ ప్రధాన రహదారిపై నీరు ప్రవహిస్తుంది. దీంతో పోలీసులు రాకపోకలను నిలిపివేశారు. ప్రమాదానికి ఆస్కారం ఉన్నందువల్ల ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోను నీటిలోకి దిగవద్దని కోరారు.

**పీటీసీ - భువనగిరి**

---------------------------------

**శ్రీరాంసాగర్**

నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ కు భారీగా వరద నీరు చేరుతుండగా జలాశయానికి చెందిన 25 గేట్లు ఎత్తివేసి నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 79.263 టీఎంసీలకు చేరుకుందని, 1091 అడుగులకు గాను, 1090.7 అఢుగులకు చేరిందని అధికారులు తెలిపారు.

**పీటీసీ - మంచిర్యాల**

----------------------------------